

ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు

ఘనంగా పోతలింగన్న విగ్రహ ప్రతిష్ఠాపన

నిర్మల్ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త పోచంపాడ్ గ్రామంలో నడుకుడ పోచమ్మ ఆలయం, అడెల్లి పోచమ్మ ఆలయం ఎదుట పోతలింగన్న విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పెద్దఎత్తున గ్రామస్థులు హాజరై భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో గ్రామ వీడీసీ సభ్యులు ఎల్. పోశెట్టి, ఆర్మూర్ నరేష్, తలారి గంగాధర్, గంగారపు గోపి, కుమ్మరి రమేష్, ఆలయ కమిటీ సభ్యులు తలారి సురేందర్, లోలం పెద్ద మల్లయ్య, కర్రె రాజేశ్వర్, కొండ పెద్ద గంగన్న, ఆర్మూర్, నడుకుడ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆయేషా మస్రత్ ఖానం

గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు ఆయేషా మస్రత్ ఖానం

ఖానాపూర్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం అన్నారు. ఆదివారం ఖానాపూర్ మండలంలో పర్యటించిన ఆమె మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సహా పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగం కోసం చేసిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. ఖానాపూర్ ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో రత్నాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతీ ఆలయంలో డిజిటల్ సేవలు కరువయ్యాయి. డిజిటల్ సేవలు, చెల్లింపుల సౌకర్యం పూర్తిస్థాయిలో అందుబాటులో లేక భక్తులకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన ఆలయాల్లో ఆన్‌లైన్‌లో వసతి, ఆర్జిత సేవల టికెట్లను అందిస్తుండగా.. బాసరలో కేవలం అక్షరాభ్యాస టికెట్లు మాత్రమే ఆన్‌లైన్‌లో లభిస్తున్నాయి. మిగతా అన్ని సేవలకు 'క్యాష్ ఓన్లీ' నిబంధనను అమలు చేస్తుండడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

బాసరలో డిజి'డల్' సేవలు



- జ్ఞాన సరస్వతీ ఆలయంలో డిజిటల్ చెల్లింపులకు ఇక్కట్లు
- నగదుకే పరిమితమైన టికెట్ కౌంటర్లు
- అంతటా 'క్యాష్ ఓన్లీ' నిబంధన
- వసతి, ఆర్జిత సేవల టికెట్లకు పాత పద్ధతే
- ఆన్‌లైన్ వ్యవస్థ కోసం నిధులు ఖర్చు చేస్తున్నా కనిపించని మార్పు
- ప్రైవేటు వ్యక్తుల వద్ద కమీషన్‌పై నగదు తీసుకుంటున్న భక్తులు

బాసర, నవంబరు7(ఆంధ్రజ్యోతి): బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతీ ఆలయంలో డిజిటల్ సేవలు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలయంలో అంతటా 'క్యాష్ ఓన్లీ' నిబంధనలే అమలవుతోంది. గత రెండేళ్లుగా అధికారులు ఆన్‌లైన్, కంప్యూటరీకరణపై ప్రకటనలు తప్ప అమలు చేయడం లేదని భక్తులు చెప్తున్నారు. ఆన్‌లైన్ వ్యవస్థ కోసం దేవస్థానం నిధులు ఖర్చు చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం మార్పు కనిపించడం లేదు.

కౌంటర్లలో నగదు చెల్లింపు నిబంధన

ఆన్‌లైన్ సేవలు అందుబాటులో లేకపోవడమే గాక, దేవస్థానం టికెట్ కౌంటర్లలో డిజిటల్ చెల్లింపుల సౌకర్యం కల్పించకపోవడం భక్తులకు మరింత ఇబ్బందిగా మారింది. పూజ టికెట్ కౌంటర్లు, వసతి గదుల కౌంటర్లలో సిబ్బంది కేవలం నగదు (క్యాష్) రూపంలో మాత్రమే చెల్లింపులు తీసుకుంటున్నారు. బ్యాంకు కార్డులు (డెబిట్/క్రెడిట్), ఫోన్‌పే, గూగుల్‌పే వంటి డిజిటల్ చెల్లింపుల పద్ధతులతో డబ్బు చెల్లించేందుకు అవకాశం కల్పించడం లేదు. చిన్న వీధి వ్యాపారుల వద్ద సైతం క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు అందుబాటులో ఉన్న నేటి కాలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసర జ్ఞా సరస్వతీ ఆలయంలో డిజిటల్ చెల్లింపుల సౌకర్యం లేకపోవడం భక్తులకు అసౌకర్యానికి గురిచేస్తోంది. హడావిడిగా ఆలయానికి వచ్చే భక్తులు, ముఖ్యంగా దూరప్రాంతాల నుంచి వచ్చేవారికి కౌంటర్ వద్ద నగదు లేకపోతే ఇబ్బందులు తప్పడం లేదు. తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు వ్యక్తుల వద్ద 10శాతం కమీషన్‌పై నగదు తీసుకుంటున్న పరిస్థితి నెలకొంది.

పాత పద్ధతిలోనే టికెట్లు.. అక్రమాలకు తావు

ఆన్‌లైన్ సేవలు, డిజిటల్ చెల్లింపులు లేక దేవస్థానం అన్నిటికెట్లను ఇంకా పాత కాగితపు పద్ధతిలోనే జారీచేస్తోంది. ఈ కాగితపు టికెట్ల జారీవిధానంపై అనేక అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అత్యధిక రద్దీ ఉండే ఆలయంలో ఈ టికెట్లను తిరిగి రీసైక్లింగ్ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. గతంలోనూ ఇలాంటి ఘటనలు వెలుగుచూసిన సందర్భాలు ఉండటంతో పారదర్శకత లోపించి ఆదాయం గండి పడుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నగదు ఇవ్వాలంటున్నారు..

- రేఖ, భక్తురాలు



దేవస్థాన టికెట్ కౌంటర్లలో క్యాష్ మాత్రమే తీసుకుంటున్నారు. ప్రసాదం కొందామంటే ఆన్‌లైన్ చేస్తామంటే ఒప్పుకోలేదు. చేతిలో కొద్ది డబ్బు ఉండడంతో చాలా ఇబ్బంది పడ్డాం. తప్పని పరిస్థితిలో క్యాష్‌తోనే ప్రసాదం కొనుగోలు చేయాల్సి వచ్చింది.

ఆధునికీకరణకు చర్యలు శూన్యం

ఒకవైపు దేశవ్యాప్తంగా ఆలయాలు టెక్నాలజీని అందిపుచ్చుకుని డిజిటలైజేషన్ వైపు పయనిస్తుంటే, బాసర దేవస్థానం మాత్రం ఆధునీకరణ దిశగా చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆన్‌లైన్ బుకింగ్ సౌకర్యం కల్పించి, కౌంటర్లలో డిజిటల్ చెల్లింపులు అనుమతిస్తే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఆన్‌లైన్ సౌకర్యం లేక భక్తులకు ఇటు అసౌకర్యానికి గురవుతుండగా, అటు దేవస్థానంలో పారదర్శకత, ప్రక్షాళనకు ఆటంకం ఏర్పడుతోంది. పాత కాగితపు టికెట్ల విధానానికి స్వస్తి చెప్పి డిజిటల్ సేవలు, చెల్లింపులను తక్షణమే ప్రారంభించాలని, ఆలయ ప్రక్షాళనకు కృషి చేయాలని భక్తులు కోరుతున్నారు.

నెలలో ఆన్‌లైన్‌లో సేవలు అందుబాటులోకి..

- అంజనాదేవి, ఆలయ ఈవో



దేవస్థానంలో ఆన్‌లైన్ సేవలు, కౌంటర్లలో కంప్యూటర్ టికెట్ల జారీ విధానం అమలు కోసం కసరత్తు చేస్తున్నాం. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో వెబ్‌సైట్ డిజైన్ పూర్తి అయింది. కౌంటర్ల వద్ద ఇంటర్నెట్ కనెక్షన్, సాంకేతిక పనులు పూర్తికాలేదు. నెల రోజుల్లో భక్తులకు ఆన్‌లైన్ పూర్తిస్థాయి సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

ట్రిపుల్‌ఐటీలో చెరీష్ 2025 సంస్కృతి సంబరాలు



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ, అధికారులు, విద్యార్థులు

బాసర, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీలో ఆదివారం చెరీష్ 2కే25 పేరిట సాంస్కృతిక సంబరాలు నిర్వహించారు. వెల్ఫేర్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించి ఈ సంబరాల్లో బీ 24, పీ2 బాలికల సమర్పణలో ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు నృత్యాలు, పాటలు, స్కిట్స్, స్టాండ్ అప్ కామేడి, వాయిద్య ప్రదర్శనలు, రీడిల్స్, మోనో యాక్షన్ వంటి అనేక సంస్కృతి కళారూపాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో వీసీ గోవర్ధన్, అధికారులున్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

గజ్జలమ్మకు ప్రత్యేక పూజలు

కుంటాల, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): కుంటాల స్థానిక గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయానికి భక్తజనం పోటెత్తింది. గజ్జలమ్మకు ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కుంటాల సర్పంచ్ బరిలో 43మంది

కుంటాల, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కుంటాల సర్పంచ్ బరిలో 43 మంది ఉన్నట్లు ఎంపీడీవో వనజ తెలిపారు. మండలంలో మొత్తం 134 వార్డులు ఉండగా, 33 వార్డులకు ఏకగ్రీవం అయినట్లు చెప్పారు. లింబా (కే) గ్రామానికి చెందిన ఒకవార్డు ఎస్టీ స్థానానికి రిజర్వుడ్ కావడంతో ఆ స్థానానికి నామినేషన్ దాఖలు కాలదేని, అభ్యర్థులందరికీ గుర్తులు ప్రకటించినట్లు పేర్కొన్నారు.

తెలంగాణ ముస్లిం ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం ఇదే..

నిర్మల్ రూరల్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముస్లిం ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ భవనంలో ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు జవాద్ హుస్సేన్ తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంఏ మతీన్, ప్రధానకార్యదర్శిగా ఇంతియాజ్ అహ్మద్, ఆర్థిక కార్యదర్శిగా మొయిజుద్దీన్, ముఖ్య సలహాదారులుగా నజీర్‌ఖాన్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. రిటైర్డ్ ఎంఈవో, ప్రస్తుత జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షులు షేక్‌హయాత్ ఎన్నికల పర్యవేక్షకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వశాఖల ముస్లిం ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండోలో జిల్లా విద్యార్థుల ప్రతిభ

నిర్మల్‌రూరల్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సరూర్ నగర్ స్టేడియంలో ఈ నెల 6న జరిగిన రాష్ట్ర టైక్వాండో ఛాంపియన్ షిప్ 2025లో పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కోచ్ దాయత్ అక్షయ్ తెలిపారు. ఈ పోటీలో రెండవ తరగతి చదువుతున్న రిక్విత బంగారు పతకం, సహస్రజిత్ కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.



బంగారు పతకం సాధించిన విద్యార్థిని

ఎంపీడీవో కార్యాలయానికి చేరిన బ్యాలెట్ పత్రాలు

నర్సాపూర్(జి), డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కీలకమైన బ్యాలెట్ పత్రాలు జిల్లా కేంద్రం నుంచి నర్సాపూర్ మండలపరిషత్ కార్యాలయానికి చేరుకున్నాయి. ఉదయం ప్రత్యేక పోలీస్ ఎస్కార్ట్ వాహనంలో ఈ సామాగ్రిని తీసుకొచ్చినట్లు ఎంపీవో తిరుపతిరెడ్డి, ఎంపీడీవో పుష్పలత తెలిపారు. ఆదివారం కూడా ఎన్నికల దృష్ట్యా అధికారులు ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. ఎన్నికల సామగ్రిని కార్యాలయంలో భద్రపరిచారు. ఎవరూ లోపలికి ప్రవేశించకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎంపీవో తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.

జౌల(బి)లో వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

తానూర్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జౌల(బి)లో ఆదివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేపట్టారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రజలు తమ వెంట రూ.50వేల కంటే ఎక్కువ నగదు తరలిస్తే రశీదులు చూపించాలని, లేదంటే సీజ్ చేస్తామని ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు.

కనుల పండువగా అయ్యప్ప ఆరట్టు

- శరణుఘోషతో పులకించిన గోదావరి తీరం



గోదావరి నది తీరానికి పాదయాత్రగా పల్లకి సేవను తీసుకెళ్తున్న స్వాములు

సోన్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మొదటి అయ్యప్ప ఆలయమైన కడ్తాల్ గ్రామ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో ఆదివారం నిర్వహించిన ఆరట్టు ఉత్సవం కన్నుల పండువగా సాగింది. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, విశేష అలంకరణ చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి గ్రామప్రధాన వీధుల్లో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అయ్యప్ప భక్తుల సంకీర్తనలు, నృత్యాల మధ్య సోన్ గ్రామసమీపంలోని గోదావరి నదితీరానికి పాదయాత్రగా పల్లకి సేవను తీసు కెళ్లారు. నదిలో స్వామివారికి వివిధరకాల పువ్వు లు, నదీజలం, పంచామృతంతో అభిషేకం చేసి ప్రత్యేక హారతి ఇచ్చారు. భక్తుల అయ్యప్ప నామ శరణుఘోషతో గోదావరి తీరమంతా మార్మోగిం ది. అనంతరం ఆలయానికి చేరుకుని ఉంజల్ సేవ నిర్వహించారు. కౌట(బి) గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి గురుస్వామి శిష్యబృందం ఆలపించిన అయ్యప్పభక్తి గేయాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదానంచేశారు. ఆలయ గురుస్వామి నర్సారెడ్డి నేతృత్వంలో జరి గిన ఈ ఉత్సవంలో వివిధ ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అలంకార ప్రియుడి అభిషేకం

ఆరట్టు ఉత్సవం సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహానికి నిర్వహించిన వివిధ రకాల అభిషేకాలు భక్తులను నయనానందం కలిగించాయి. పవిత్ర గోదావరి జలం, వివిధ రకాల పుష్పాలు, పాలు, కొబ్బరి నీళ్లు, తేనె, చక్కెర, విభూతి, గంధంతో జరిగిన అభిషేకాలు, అయ్యప్ప నామసంకీర్తనలు, విశేష పూజల నడుమ భక్తులంతా తన్మయత్వం పొందారు.



జాతరలో చిరు వ్యాపారులతో కిటకిటలాడిన దృశ్యం

ఘనంగా దేవుడి చెరువు జాతర



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

నర్సాపూర్(జి), డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు దిలావర్‌పూర్, కుంటాల, లోకేశ్వరం, సారంగాపూర్ మండలాల భక్తజన సందోహం మధ్య శ్రీమల్లికార్జున స్వామి, దేవుడి చెరువు జాతర వైభవంగా ముగిసింది. జాతరకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్థులతోపాటు నాలుగు మండలాల ఎస్సైలు, గ్రామీణ సీఐ, ఇతర సిబ్బందితో కలిసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. దేవుని చెరువు కట్ట తెగిపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని పోలీసులు మోహరించి ఎక్కడ పార్కింగ్ ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షించారు. ఎన్‌సీసీ విద్యార్థులకు కూడా భక్తులకు సేవలను అందించగా భక్తుల సౌకర్యార్థం వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సౌకర్యం కల్పించారు. రైతులు పండించిన నూతన ధాన్యంతో నైవేద్యం తయారుచేసి మల్లికార్జున స్వామికి సమర్పించారు. జాతరకు అత్యంత ప్రత్యేక ఆకర్షణగా నలిచిన అగ్గు కళాకారులు తమ శివుడి నాట్యం, డమరుతో కూడిన పాటలతో భక్తులను మంత్రముగ్ధులను చేశారు. రోల్డ్ గోల్డ్ నగలు, రంగురంగుల బొమ్మలు విక్రయించే చిరు వ్యాపారుల షాపులు కిటకిటలాడగా పిల్లలకు ఏర్పాటు చేసిన జాయింట్ వీల్ స్వింగ్ రైడ్స్ ఆటల గుడారాలు ఉల్లాసాన్ని పంచాయి.

ఎన్నికల ఖర్చు పత్రాలు తప్పనిసరిగా ఇవ్వాలి



అభ్యర్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్నికల అధికారులు

కుంటాల, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రోజువారి ఖర్చుల వివరాల పత్రాలను తప్పనిసరిగా ఇవ్వాలని ఎన్నికల జిల్లా ఖర్చుల అధికారి కేబీ మనోహర్ రాజు అన్నారు. ఆదివారం మండలకేంద్రం కుంటాలలో సర్పంచ్, వార్డుసభ్యుల బరిలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల ఖర్చుల వివరాలు తెలిపే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అబ్జర్వర్ బీ.లలితా, కృష్ణయ్య, వినోద్ కుమార్‌లు పాల్గొని బరిలో ఉన్న అభ్యర్థులు లెక్కలు తెలిపే విధానంపై అవగాహన కల్పించారు. అభ్యర్థులు లెక్కల ఖర్చుల వివరాలను సక్రమంగా చూపని యెడల చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వనజ, ఎంపీవో రహీం తదితరులు ఉన్నారు.

అవగాహన కార్యక్రమానికి అధికారులు గైర్హాజరు

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని రైతువేదికలో ఎన్నికల నియమావళి, ఖర్చులపై సర్పంచ్, వార్డు మెంబర్‌గా పోటీ చేస్తున్న అభ్యర్థులకు అవగాహన కల్పిచేందుకు ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎన్నికల పరిశీలకులు, అధికారులు ఎవరూ హాజరు కాలేదు. గంటల తరబడి వేచిచూసిన అభ్యర్థులు చివరికి వెనుదిరిగారు. ఎన్నికల నిబంధనలపై స్పష్టత ఇవ్వడంలో అధికారులు విఫలమవుతున్నారని విమర్శలు వస్తున్నాయి.



అధికారుల కోసం ఎదురు చూస్తున్న సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి: టీఆర్‌టీఎఫ్

నిర్మల్‌చైన్‌గేట్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పాల్గొనే ఉద్యోగ ఉపాధ్యాయుల ఇబ్బందులను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి దర్శనం దేవేందర్, గడ్డం భూమన్న ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగ ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకుంటున్నారని, వారి ఓటు గోప్యతను కాపాడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. అలాగే ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి తప్పించాలని, దివ్యాంగులకు, గర్భిణీలకు, ఫీడింగ్ మదర్స్‌కు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవారిని విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు విధులను మండలాలను కాకుండా సుదూర మండలాలకు విధులు కేటాయిస్తున్నారని, సమీప చుట్టు పక్కల మండలాలకు విధులు కేటాయించే విధంగా ప్రభుత్వం ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేశారు.



సన్నిధానంలో అయ్యప్ప మాలధారులు

హరిహర సుతనే.. అయ్యప్ప

(5వ పేజీ తరువాయి)

- ఇచ్చోడలో మహిమాన్వితమైన ధర్మశాస్త్ర ఆలయం
- నిత్యం మణికంఠుడికి ధూపదీప నైవేద్యాలు
- నేడు ఘనంగా అయ్యప్ప ఆలయ 11వ వార్షికోత్సవం

ఇచ్చోడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ సీజన్‌లో నిత్య అన్నదానంతో పాటు ప్రతీ బుధవారం ఇచ్చోడ అయ్యప్ప స్వామి ఆలయంలో భిక్ష సదుపాయం ఉంటుంది. దీనిలో భాగంగా అయ్యప్ప ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మధ్యాహ్నం భారీస్థాయిలో అన్నదానం జరుపుతున్నారు. ఆలయంలో ప్రత్యేకమైన వంటశాలను నిర్మించారు. అన్నదాన సమయంలో వంటలు మొదలుకుని వడ్డన, పాత్రలు కడిగే వరకు యువత, పేద, ధనిక తేడా లేకుండా అందరు స్వచ్ఛందంగా వచ్చి ఆలయంలో పలు రకాల సేవలు చేస్తుంటారు.

నేడు మహా భిక్ష, మహా పడిపూజ

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులందరూ కలిసి వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 8గంటలకు అయ్యప్ప అరట్టు కార్యక్రమం మొదలుకొని ఆలయం నుంచి పట్టణ పురవీధుల్లో స్వామివారి పల్లకి ఊరేగింపును పురస్కరించుకొని మధ్యాహ్నం స్వామివారికి స్థానిక కడెం నదిలో చక్రస్నానం ఆచరించడం జరుగుతుంది. అనంతరం అయ్యప్ప ఆలయ అవరణలో జాతర సందర్భంగా మహాభిక్ష నిర్వహిస్తారు. సాయంత్రం అయ్యప్ప స్వామి దివ్య పదునెట్టాంబడి కార్యక్రమం నిర్వహించి జ్యోతి స్వరూపుడికి పడిదీపాలు ముట్టించి ప్రత్యేక మహా పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇచ్చోడ అయ్యప్ప ఆలయం మండల కేంద్రంతో పాటు సిరికొండ, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, బోథ్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలతో పాటు నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల నుంచి అయ్యప్ప మాలధారులు భక్తులు హాజరై పడిపూజ భజన బృందంలో పాల్గొంటారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

సువర్ణ మహాదేవ్ గురుస్వామి, అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యుడు, ఇచ్చోడ



ఇచ్చోడలోని అయ్యప్ప ఆలయానికి దిన దిన భక్తజనం సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. అలాగే దాతలు కూడా ముందుకువస్తున్నారు. దీంతో ఆలయం అందరి సహకారంతో అభివృద్ధి చెందుతుంది. ఇక్కడ మాల వేసుకున్న భక్తులు నిష్ఠ నియమాలతో ప్రతియేటా మాలధారణ చేస్తున్నారు. ప్రతీయేటా ఆలయ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం. మాలధారులే కాకుండా భక్తులు, పట్టణ, గ్రామీణ ప్రాంత వాసులు పెద్దఎత్తున హాజరై పండగ వాతావరణం ఏర్పడుతుంది.



ప్రతీ బుధవారం నిత్య అన్నదానం

- చెన్నాల మల్లేశ్వర్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు, అడేగామ

అయ్యప్ప ఆలయం నిర్మించి పదకొండు ఏళ్లు కావస్తుంది. ఆలయం నిర్మించినప్పటి నుంచి దినదిన అభివృద్ధి చెందుతూ.. కార్తీక మాసంలో మాలలు వేసుకున్న తరువాత మండల కాలంలో మాత్రమే నిత్యం భిక్ష కార్యక్రమం ఏర్పాటు చేసుకునేవాళ్లం. అందరి సహకారంతో నేడు మండల కాల భిక్షాతో పాటు ఏడాది మొత్తంలోని ప్రతి బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు సంతోషంగా ఉంది.

మందుబాబుల అరెస్టు



మద్యం మత్తులో షాపు ముందు పడుకున్న మందుబాబు

బోథ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మద్యం దుకాణం బస్టాండ్‌లు ఏర్పాటు కావడం వల్ల ప్రతీ రోజు ఉదయం ప్రాంతంలోని పలువురు దుకాణాల వారు ఆందోళన చేస్తున్న ఉదయం పూటనే మందుబాబులు బస్టాండ్ షాపులో మద్యం తాగిన దుకాణాల ముందు పడుకుంటున్నారని వాపోతున్నారు. బస్టాండ్‌లో మద్యం షాపు ఏర్పాటు వల్ల ఈ దుస్థితి నెలకొందని దుకాణాల వారు చేరుకుంటున్నారు.

తెలుగు వర్ణమాల ప్రకారం గుర్తుల కేటాయింపు



పరిశీలిస్తున్న ఎంపీఈఓ రమేష్

బోథ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బోథ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను ఆదివారం ఎంపీడీవో రమేష్ పరిశీలించారు. గుర్తులు కేటాయించేటప్పుడు తెలుగు వర్ణమాల ప్రకారం కేటాయించాలని సూచించారు. ఎలాంటి తప్పులు లేకుండా పరిశీలించాలన్నారు. ఆర్‌ఓ వేణు, ఏఆర్‌వో సత్యనారాయణలకు సూచించారు.

పంచాయతీ ఎన్నికల వేళ..

మద్యానికి భలే గిరాకీ

- పక్షం రోజుల్లో

రూ.36కోట్ల మద్యం అమ్మకాలు



ఆదిలాబాద్ డిపో నుంచి మద్యం దుకాణాలకు తీసుకెళ్తున్న మద్యం



మద్యం బాటిళ్లు

ఉట్నూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగడంతో పాటు మొదటి దశ ఎన్నికల ఘట్టం చివరి దశకు చేరుకుంటుండడంతో మద్యం అమ్మకాల జోరు పెరిగింది. గత పక్షం రోజుల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ ఆదిలాబాద్ ఆసిఫాబాద్ జిల్లాలో రూ.36 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు తెలుస్తుంది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ పడుతున్న సర్పంచ్ అభ్యర్థులతో పాటు కొన్ని చోట్ల వార్డు సభ్యులు సైతం ఓటర్లను ఆకట్టుకోవడానికి మద్యం ఎరచూపిస్తున్నట్లు తెలుస్తుంది. మద్యం రేట్లు తెలంగాణ రాష్ట్రంలో అధికంగా ఉండడంతో కొందరు మహారాష్ట్ర నుంచి మద్యం తెచ్చుకుంటున్నట్లు తెలుస్తుంది. ఆదిలాబాద్ జిల్లాటని ఉట్నూర్, ఆదిలాబాద్, బోథ్ ప్రాంతాల్లో ఉన్న 51వైన్స్ షాపులతో పాటు బార్ షాపు ల కోసం గత పక్షం రోజుల్లో రూ.11.75కోట్ల విస్కీ, బ్రాండీ, బీర్లు అమ్మకాలు జరిగినట్లు తెలుస్తుంది. నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్, నిర్మల్, భైంసా ప్రాంతాల్లో ఉన్న 55వైన్ షాపులతో పాటు బార్‌లలో రూ.15.60కోట్లు, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ప్రాంతాలలో రూ.8.85కోట్ల విలువ గల మద్యం విక్రయాలు జరిగినట్లు తెలుస్తుంది. మద్యం ప్రియులతో ఆయా ప్రాంతాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు సైతం మద్యం కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నట్లు తెలుస్తుంది.

పెరిగిన గుడుంబా, తెల్ల కల్లు విక్రయాలు..

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మద్యానికి తోడు గుడుంబా, తెల్ల కల్లు విక్రయాలు సైతం ఊపందుకున్నాయి. వైన్స్ షాపుల వద్ద సైతం అభ్యర్థుల ప్రచారానికి పని చేసిన వారు చేరి మద్యం కొనుగోలు చేస్తున్నారు.

బందెల దొడ్డి లేని గ్రామం పిప్పల్‌కోటి



పత్తి పంట నాశనం చేస్తున్న పశువులు

భీంపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పంచాయతీకి పంచాయతీ కార్యాలయం ఉన్నట్లే తప్పకుండా బందెల దొడ్డి (గజ ఘాట్) ఉం టుంది. పశువులు మరొక్కరి చేనులో పంట నాశనం చేస్తే ఆ రైతు పశువులను తీసుక వచ్చి బందెల దొడ్డిలో వేస్తారు. దానికి గ్రామ పంచాయతీ వారు నిర్ణీత జరిమానా వసూలు చేసి వదిలివేస్తారు. ఒక వేళ గడువు లోగా ఆ పశువుల తకుకు యజమాని జరిమానా రుసుము చెల్లించక పోయితే ఆ పశువును వేలం వేసి పంచాయతీ ఆదాయానికి జమచేస్తారు. ఇక విషయానికి వస్తే భీంపూర్ మండలంలోని అన్ని పంచాయతీలలో ఈ బందెల దొడ్డి ఉన్న ఒక్క పిప్పల్కోటి పంచాయతీలో మాత్రం కొన్ని ఏళ్ల నుంచి బందెల దొడ్డి లేదు. దీనితో తమ పంటను నాశనం చేసిన ఆ రైతులు పశువులను చేను దాటిచ టం తప్ప ఏమి చేయలేని పరిస్థితి ఉంది. అలాగే పంచాయతీకి వచ్చే ఆదాయం కూడా రావటం లేదు. దీంతో వేల ఎకరాల్లో పంటలు పండించే వందలాది రైతు కుటుంబాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా పంచాయతీ అధికారులు పిప్పల్‌కోటిలో బందెల దొడ్డి నిర్మాణానికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

నాయకుల వైఫల్యం



మా పిప్పల్ కోటి గ్రామంలో గజ ఘాట్ లేక రైతులం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పశువులు పంట చేల్లను నాశనం చేస్తున్నాయి ఇప్పటికైనా నాయకులు, అధికారులు చొరువ తీసుకుని పిప్పల్ కోటిలో గజఘాట్‌ను ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నాం.

రెండ్ల జనార్ధన్, రైతు, పిప్పెల్కోటి

శాంతి భద్రతలను కాపాడేందుకు

ప్రతీఒక్కరు సహకరించాలి

సారంగాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో శాంతి భద్రతలను కాపాడడానికి ప్రతీ ఒక్కరు సహకరించాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. ఆదివారం విలేకర్లతో ఈ సందర్భంగా మాట్లాడారు. ఎన్నికల ప్రచారాల సమావేశాలు ర్యాలీలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, కులం, మతం వారీ ఆధారంగా ప్రచారం చేయడం, ద్వేష పూరిత వ్యాఖ్యలు చేయడం నిషేదం అన్నారు. అర్ధరాత్రి సౌండ్‌తో ప్రచారం చేయరాదని ఓటర్లకు డబ్బు, మద్యం, బహుమతులు ఇవ్వడం పెద్ద నేరమని పేర్కొన్నారు. ప్రచార, వాహనాలు సౌండ్ బాక్సులకు అనుమతి తీసుకొని పరిమితికి లోబడి అనుసరించాలని తెలిపారు. ప్రత్యర్థులు రెచ్చగొట్టే చర్యలు పూర్తిగా నిషేదమన్నారు. ఇళ్లకు వెళ్లి ఓటర్లను బెదిరించడం, ఒత్తిడి చేయడం, మానసిక ఒత్తిడి పెట్టడం చట్టపరంగా నేరమని పేర్కొన్నారు. ఓటర్లను తరలించడం, నియంత్రించడం, వారి ఓటు స్వేచ్ఛపై ప్రభావం చూపడంతో పాటు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే అభ్యర్థులపై విచారణ, కేసులు, అభ్యర్థిత్వం రద్దు వంటి చర్యలు జరుగుతాయన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడంతో పాటు రెచ్చగొట్టే విడియోలు పెడితే ఐటి చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



20 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సందడి

నిర్మల్ రూరల్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో కలిసి చదువుకున్న విద్యార్థులంతా 20 ఏళ్ల తర్వాత ఒకచోట చేరి సందడి చేశారు. మంజులాపూర్‌లోని సిరి బాంకెట్ హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌కి చెందిన సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో 2004-05 లో పదో తరగతి చదువుకున్న 30 మందికి పైగా విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఆనాటి రోజులను గుర్తు చేశారు. ఆ రోజుల్లో తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను పిలిచి ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఉదయం పూట అధ్యాపకుల ప్రసంగాలతో భావోద్వేగంగా సాగిన ఈ కార్యక్రమం సాయంత్రం ఆటపాటలతో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

272 వార్డుల్లో 20 ఏకగ్రీవాలు

- వివిధ గ్రామ పంచాయతీల్లో వార్డు సభ్యుల ఎన్నిక పూర్తి

నర్సాపూర్(జి), డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లోని మొత్తం 272 వార్డుల ఎన్నికల ప్రక్రియలో 20 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత ఈ ఏకగ్రీవ ప్రక్రియ పూర్తయ్యింది. ఈ ప్రక్రియలో ఆరుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. నామినేషన్ ఉపసంహరించుకున్న వారిలో అంజనీ తండా మొదటి వార్డు నుంచి పవార్ రాజేశ్వర్, బూరుగుపల్లి(జి) తండా ఆరో వార్డు నుండి రాథోడ్ విజయ, కుస్లీ గ్రామం ఒకటో వార్డు నుంచి పుష్ప, రాంపూర్ గ్రామం రెండో వార్డు నుంచి అర్జున్ సింగ్ ఠాకూర్, గాడి సాగర్, అలాగే టెంబుర్ని గ్రామం ఆరవ వార్డు నుంచి బ్యాగరి లక్ష్మీ ఉన్నారు.

ఏకగ్రీవమైన వార్డు సభ్యుల వివరాలు..

మొత్తం 20 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, వారిలో అర్లీ(కే) గ్రామం నుంచి ముగ్గురు, రెండవ వార్డు సభ్యురాలు సిందే నవనీత, మూడవ వార్డు సభ్యుడు రాకేష్ కదం, ఆరో వార్డు సభ్యురాలు సిర్మని భోజవ్వ, భామ్ని(బి) గ్రామం నుంచి ఆరుగురు మొదటి వార్డు సభ్యులు పవార్ దిగంబర్, మూడవ వార్డు సభ్యులు గణేష్ చాతల, నాలుగో వార్డు సభ్యురాలు గంగాసాగర్, ఐదవ వార్డు సభ్యుడు సర్వదా దత్త హరి, ఆరవ వార్డు సభ్యురాలు కోడిచెర్ల సంగీత, ఎనిమిదో వార్డు సభ్యురాలు రాథోడ్ సునీత, చాక్‌పల్లి గ్రామ పంచాయతీలో మూడు వార్డులు ఏకగ్రీవం కాగా, నాలుగవ వార్డు సభ్యుడిగా సాయన్న ఎన్నికయ్యారు. చాక్‌పల్లి అనుబంధ గ్రామం న్యూ డోంగూర్ ఏడవ వార్డు సభ్యురాలుగా రమ్య జంగిపల్లి, ఓల్డ్ డోంగూర్ ఎనిమిదో వార్డు సభ్యురాలు సిర్మని వనిత ఏకగ్రీవమయ్యారు. గొల్లమాడ గ్రామ పంచాయతీ ఎనిమిదో వార్డు సభ్యుడిగా బాశెట్టి విజయ్ కుమార్ ఏకగ్రీవమయ్యారు. తురాటి గ్రామ పంచాయతీలో మొత్తం ఎనిమిది వార్డులకు గాను, ఏడవ వార్డు సభ్యుడు తప్ప మిగతా ఏడుగురు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికకావడం విశేషం. ఈ విధంగా వివిధ గ్రామ పంచాయతీలలో కలిపి మొత్తం 20 వార్డు సభ్యులు ఏకగ్రీవంగా తమ స్థానాలను దక్కించుకున్నారు.



ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు వండిన భోజనం పరిశీలిస్తున్న పీవో

పల్స్ యాప్‌తో అక్రమాలకు తెర

(5వ పేజీ తరువాయి)

పరిశీలించడం జరిగింది. దీంతో పాటు నిత్యావసర సరుకుల రిజిస్టర్‌లు సైతం తనిఖీలు నిర్వహించారు. పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలలో ఎవరిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండానే ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తన ఆలోచన మేరకు పల్స్ యాప్ రూపొందించి గత 15 రోజుల క్రితం ఆదిలాబాద్ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా పల్స్ యాప్ ప్రారంభించారు. ఈ యాప్‌కు జియో ట్యాగింగ్ చేయడం ద్వారా ఏ ప్రదేశం నుంచి పల్స్ యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ అవుతున్నాయో? గ్రహించవచ్చు. దీంతో పాటు మెనూ ప్రకారం విద్యార్థులకు కావాల్సిన ఆహార పదార్థాలు అందిస్తున్నారా? లేదా? పరిశీలించనున్నారు. ఈ విధానం పాఠశాలల్లో మెనూ సరిగ్గా అమలు అవుతుండడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో కూడా ఈ పల్స్ యాప్ ద్వారా విద్యార్థుల ప్రయోజనాలు కాపాడడానికి కృషి చేస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌లు, వసతి గృహ సంక్షేమాధికారులు, డిప్యూటీ వార్డెన్‌లకు పల్స్ యాప్‌పై అవగాహన కల్పించారు.

మొత్తం 133 ఆశ్రమ పాఠశాలలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 133 ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేసి గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుంది. ఆదిలాబాద్ జిల్లాలో 54 ఆశ్రమ పాఠశాలల్లో 11,863 మంది విద్యార్థులు, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 45 ఆశ్రమ పాఠశాలలో 8,286 మంది విద్యార్థులు, మంచిర్యాల జిల్లాలో 16 ఆశ్రమ పాఠశాలల్లో 1,940 మంది విద్యార్థులు, అలాగే నిర్మల్ జిల్లాలో 17 ఆశ్రమ పాఠశాలల్లో 3,530 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇవి కాకుండా గురుకుల పాఠశాలలు, గురుకుల కళాశాలలు, ఏకలవ్య ఆదర్శ పాఠశాలలు 29 కొనసాగుతుండగా వందలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. రానున్న మరికొన్ని రోజుల్లో ఈ పల్స్‌యాప్‌ను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అమలు చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి భావిస్తున్నట్లు తెలుస్తుంది.

పల్స్ యాప్.. ఒక మంచి ఆలోచన

- మేస్రం గంగారాం, ఆశ్రమ పాఠశాలల టీచర్, ఉట్నూర్



ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న గిరిజన విద్యార్థులకు సక్రమంగా భోజనం అందించడానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఏర్పాటు చేసిన పల్స్ యాప్ మంచి ఆలోచన. పల్స్‌యాప్ ఏర్పాటు చేయడం ద్వారా ఎలాంటి అక్రమాలు జరగకుండా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు అందుతాయి.



విద్యార్థులకు నాణ్యమైన భోజనం

- జాదవ్ అంబాజీ, ఐటీడీఏ డీడీ, ఉట్నూర్

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడానికి ప్రాజెక్టు అధికారి ఈ పల్స్ యాప్ రూపొందించారు. ఆదిలాబాద్ జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నాం. మరికొన్ని రోజుల్లో ఉమ్మడి జిల్లాలో అమలు చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ ఆధారంగా విద్యార్థుల కు మంచి ఆహారం అందుతుంది. గతంలో కొందరు పొరపాట్లు చేసేవారు. ఎలాంటి అక్రమాలు జరగకుండా ఉండడానికి ఈ యాప్ దోహదపడుతుంది.

స్థానిక పోరులో యువత బిజీ బిజీ

- ఆదిలాబాద్ ఎస్పీ యువతకు దిశా నిర్దేశం



గ్రామస్థులకు దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ (ఫైల్)

బోథ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రం అభివృద్ధిలో రోజు రోజుకు దూసుకు పోతున్నది. సమర్థవంతమైన చదువరులు ఉన్న ఈ గ్రామంలో వారికి ఏ మాత్రం తీసిపోలేము అన్నట్లు జిల్లా, రాష్ట్రస్థాయి రాజకీయ పార్టీల నేతలు ఉన్నారు. అయితే ఒక్కప్పుడు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకున్న ఈ గ్రామం ప్రజలు ఇప్పుడు రాజకీయ కక్షలతో ఊగిసలాడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు రావడంతో గ్రామంలో ఉన్న యువకులు గరం గరంగా ఎన్నికల రణరంగంలో తిరుగుతున్నారు. సర్పంచ్ స్థానం మహిళలకు కేటాయించడంతో పోటీ చేసేందుకు ఆసక్తి చూపిన వారంతా వారి వారి కుటుంబాల వారిని రంగంలోకి దిం చారు. దీంతో రాజకీయ కక్షలు పెరిగి పోయాయి. శుక్రవారం నామినేషన్‌ల సందర్భంగా యువకులు దాడులకు పాల్పడడం చూస్తుంటే ఎన్నికలు అయ్యేంత వరకు గ్రామంలో పరిస్థితి ఏవిధంగా ఉంటుందోనని గ్రామపెద్దలు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. యువతకు తోడు కొంత మంది రాజకీయ నాయకులు తమతమ అనుచర వర్గాల వారికి మద్ధతు నిస్తుండడంతో రాజకీయ రంగం మరింతగా వేడెక్కింది.

పేరున్న ఊరిలో ఇదేం పరిస్థితి ఎస్పీ

చదువులతో కొలువులు దీరిన ఎంతో మంది యువకులు ఉన్న ఈ గ్రామం మంచి పేరు సంపాదించింది. కలిసి కట్టుగా గ్రామస్థులంతా గ్రామ అభివృద్ధి కోసం కృషి చేయాలని ఎన్నికల కోసం గ్రూపులుగా మారి వివాదాలకు కొట్లాటలకు దిగితే చర్యలు తప్పవు అన్నారు. ముఖ్యంగా యువకులు తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని శనివారం జరిగిన కార్యక్రమంలో పిలుపునివ్వడం జరిగింది. మంచి పేరున్న గ్రామంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని హితవు పలికారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

- ప్రమాదకరంగా మారిన మురికి కాలువల స్లాబ్‌లు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు, పాలకవర్గాలు



మహాలక్ష్మి మందిర రోడ్డు మార్గంలో కూలిన మురుగు కాలువ స్లాబ్

భైంసా, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వార్డుల పరిధిలో గల మురికి కాలువల స్లాబ్‌లు ప్రమాదకర స్థితికి చేరుకున్నాయి. ఆయా ప్రాంతాల పరిధిలోని మురికికాల్వల స్లాబ్‌లు కూలిపోయి, దెబ్బ తిని రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రధానంగా అంతర్గత రోడ్డు మార్గాల్లోని మురికి కాలువలపై వేసిన స్లాబ్‌లు పలు కారణాలతో కూలిపోతున్నాయి. రోడ్డు మధ్య భాగాల్లో స్లాబ్‌లు కూలిపోతుండడంతో ఈ మార్గాల మీదుగా రాకపోకలు నిర్వహించే వాహన చోదకులు ఎంతమాత్రం ఆదమరిచినా ప్రమాదం బారిన పడాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. సమస్యలు ఏర్పడి సంవత్సరాల తరబడి కాలం గడుస్తున్నా సంబంధిత సమస్యను పరిష్కరించే విషయంలో మున్సిపల్ అధికార, పాలకవర్గాలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తున్నాయి. ఫలితంగా ప్రమాద ఘటనలు పెరుగుతున్నాయి. పట్టణంలోని కిసాన్ గల్లి ప్రాంతంలో, మహాలక్ష్మి మందిర ప్రాంతంలో ఇలాంటి సమస్యలు అధికంగా ఉన్నాయి. మున్సిపల్ అధికార, పాలకవర్గాలు ఇకనైనా స్పందించి సమస్య నివారణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రెండేళ్లలో ఆర్మూర్ అంధకారమయం

- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను స్ర్కీన్‌పై చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్ టౌన్ , డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గడిచిన పదేళ్ల కాలంలో ఆర్మూర్ నియోజకవర్గం స్వర్ణయుగంగా వెలిసిందని, గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో నియోజకవర్గం అంధకారమైందని కాంగ్రెస్, బీజేపీల పుణ్యమా అని అంతా అవినీతిమయం అవుతూ అభివృద్ధిమయమైందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలోని జీవన్‌రెడ్డి ఇంట్లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అణాపైసా నిధులు తేలేదని, కాంగ్రెస్ ఇన్‌చార్జి పీవీఆర్ అవినీతిలో ముందున్నారని, బీజేపీ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అభివృద్ధిలో ఫ్లాప్ అయ్యారని విమర్శించారు. బీఆర్ఎస్ పథకాలను తామే తెచ్చామని కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం చేస్తుందని అన్నారు. రూ.3 వేల కోట్లతో నియోజకవర్గాన్ని తీర్చి దిద్దానని 100 పడకల ఆసుపత్రి, రెవెన్యూ డివిజన్, రూ.20 కోట్లతో సిద్దుల గుట్టకు గ్రాట్‌రోడ్డు, రూ.150 కోట్లతో పంచగూడ వంతెన నిర్మాణం, బైపాస్ రోడ్లనిర్మాణంతో పాటు అన్ని సామాజిక వర్గాలకు కమ్యూనిటీ హాల్‌ల నిర్మాణం చేపట్టామన్నారు. నియోజకవర్గంలో రోడ్డు లేని ఊరుందా అని ప్రశ్నించారు. తమ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను స్ర్కీన్‌పై ప్రదర్శించారు. రెండేళ్లలో నియోజక అభి వృద్ధి ఆమడదూరం పోయిందని ప్రజల బాధలు పట్టని నాయకులు ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల అవినీతి అక్రమాలకు, తప్పుడు పనులకు జనతా గ్యారేజ్‌లో రిపేర్ చేస్తానని హెచ్చరించారు. జిల్లా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని నిధులు ఇచ్చిందో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అభివృద్ధిపై పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, సీనియర్ నాయకులు పోల సుదాకర్, రాజేశ్వర్‌రెడ్డి, మీరా శ్రావణ్, పృథ్వీ, గణేష్, హాజీమ్, తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీతోనే అభివృద్ధి : మేస్రం భాగ్యలక్ష్మి



ఉట్నూర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ మద్దతురాలు భాగ్యలక్ష్మి

ఉట్నూర్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీకి ఓట్లు వేయడం ద్వారా ఉట్నూర్ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి మేస్రంభాగ్యలక్ష్మి అన్నారు. ఆదివారం ఉట్నూర్ వారసంతలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ ఆధ్వర్యంలో ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నందున ప్రతీ ఒక్కరు తనను ఆదరించి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు ఓట్లు వేయాలన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నందున ఆయన అడుగు జాడల్లోనే తాను కూడా ఉట్నూర్ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని వ్యాపార సంస్థల యజమానులను కలిసి తన బెండకాయ గుర్తుకు ఓటు వేయాలని ప్రాధేయపడ్డారు.ఈ కార్యక్రమంలో ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా

- రాథోడ్ చారులత



ఉట్నూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న రాథోడ్ చారులత

ఉట్నూర్,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి):ఉట్నూర్ సర్పంచ్‌గా తనకు అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్‌ఎస్ మద్దతుతో ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు రాథోడ్‌చారులత స్పష్టం చేశారు. ఆదివారం ఉట్నూర్ వారసంతలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారాన్ని మాజీ జడ్పీచైర్మన్ రాథోడ్ జనార్ధన్‌తో కలిసి నిర్వహించారు.ఉట్నూర్‌కు చెందిన ఓటర్లతో పాటు వ్యాపారులను కలిసి తన ఎన్నికల గుర్తు ఫుట్‌బాల్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ఉట్నూర్ పట్టణంలో రోడ్ల సమస్యను పరిష్కరించి, మంచినీటి వ్యవస్థను మెరుగు పరుస్తానని అన్నారు. ఉట్నూర్ పట్టణంలో సెంట్రల్ లైటింగ్ సిస్టంట్ ఏర్పాటు చేయించి పట్టణానికి కళ వచ్చేలా కృషి చేస్తానన్నారు.అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అందేలా చూస్తానని అన్నారు.స్వచ్ఛ గ్రామం దిశగా ఉట్నూర్ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రజలు భారీ మెజార్టీతో తనను గెలిపించాని కోరారు.

ఆదర్శ పంచాయతీగా అభివృద్ధి చేస్తా

● బానోత్ సంగీత



ఉట్నూర్‌లో సర్పంచ్ అభ్యర్థి సంగీత ప్రచారం పాల్గొన్న రితేష్‌రాథోడ్

ఉట్నూర్,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి):ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తానని ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ బరిలో బీజేపీ మద్దతుతో ఉన్న భానోత్‌సంగీత అన్నారు.ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్‌తో కలిసి పూలమాలవేసి నివాళులర్పించి ఉట్నూర్ వారసంతలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతకు వచ్చిన ఉట్నూర్ పట్టణ ప్రజలను అమూల్యమన ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. పట్టణంలోని వ్యాపారులను కలసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రితేష్‌రాథోడ్ మాట్లాడుతూ ఆధ్యాత్మికురాలు సంగీత టూత్‌పేస్ట్ గుర్తుకు ఓటువేసి గెలిపించడం ద్వారా ఉట్నూర్ అభివృద్ధికి మేలు జరుగుతుందన్నారు. ఆదిలాబాద్ ఎంపీ గోడంనగేష్ సహకారంతో ప్రత్యేక నిధులు తెచ్చి ఉట్నూర్ అభివృద్ధికి పాటు పడతామన్నారు.ఉట్నూర్ పట్టణంలో మురికి కాలువలు, సీసీ రోడ్లు అవసరమైన చోట నిర్మించి అర్హులందరికి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అందేలా చూస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు బింగివెంకటేశ్, బీజేపీ జిల్లా కార్యదర్శి కొండేరిరమేష్ తదితరులున్నారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదు

బోథ్,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి):సోనాల మండల కేంద్రంలో శుక్రవారం పలువురు వ్యక్తులు పోలీసు విధులకు ఆటంకం కలిగించినందుకు గాను వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్సై శ్రీసాయి తెలిపారు. సోనాల గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద నామినేషన్ పత్రాలు దరఖాస్తు చేసిన సమయంలో సాయంత్రం ఐదున్నర గంటలకు అదె గ్రామానికి చెందిన నల్ల విజయభాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి కార్యాలయంలోకి అనుమతించాలని పోలీసులను అడగడం జరిగిందన్నారు. అయితే సమయం అయిపోయిందని లోపలికి అనుమతించమని పోలీసులు తెలుపగా వారితో గొడవకు దిగారని అన్నారు.అదే సమయంలో రామాయణం మహిళ గాజుల శ్రీనివాస్ అనే వ్యక్తి నామినేషన్ ప్రతిపాదించి వస్తుండగా ఆయనతో విజయభాస్కర్‌రెడ్డి గాజుల శ్రీనివాస్‌తో కొట్లాటకు దిగాడని ఎస్సై వివరించారు. గొడవ ఆపడానికి ఎంతప్రయత్నించినా వినకుండా ఆందోళన చేయడంతో పాటుగా ఆయన పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. 100 మీటర్ల దూరంలో ఉండాల్సిన వారు నిబంధన ప్రకారం అక్కడే ఉండాలని లేకుంటే చర్యలు తప్పవన్నారు. ఎవరైనా వ్యతిరేకంగా వ్యవహరించే కేసులు తప్పవని ఆయనపేరుకొన్నారు.

మేజర్ పంచాయతీ అంటే..?

ఇచ్చోడ, డిసెంబరు, 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయితీలు రెండు రకాలుగా ఉంటాయి. వార్షిక ఆదాయం రూ.60 వేల కంటే ఎక్కువ ఉండటంతో పాటు గ్రామ జనాభా 10వేలు దాటితే నోటిఫైడ్ గ్రామపంచాయితీ అంటారు. దీనినే మేజర్ గ్రామపంచాయతీగా పేర్కొంటారు. ఈ పంచాయతీలకు నిధుల లభ్యత కూడా అధికంగా ఉంటుంది. విధులు నిర్వహించే సిబ్బంది సైతం ఎక్కువగానే ఉంటారు.

ఏకగ్రీవమైన ఆరెపల్లి సర్పంచ్‌ను సన్మానించిన ఎమ్మెల్యే



ఆరెపల్లి ఏకగ్రీవ సర్పంచ్‌తో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నెరడిగొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరెపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన బానోత్ కవిత రవిని మరియు నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఘనంగా ఆదివారం తన నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి నూతన పాలక వర్గం కృషి చేయాలనీ సూచించారు. అనంతరం నూతన పాలకవర్గ సభ్యులను సైతం శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



పార్టీలో ఆహ్వానిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

ఆదిలాబాద్‌టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. జైనథ్ మండలం నిరాల బీజేపీ మాజీ ఎంపీటీసీ చౌదరి వైష్ణవి చంద్రకాంత్‌తోపాటు పలువురు నేతలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక ప్రజా సేవ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. వారితో పాటు... జిల్లా బార్ అసోసియేషన్ కార్యదర్శి బీఎస్సీ శర్మ, అడ్వకేట్లు కాప్సే రవి, రాహుల్ వారే, డాక్టర్ కిరణ్ లు పార్టీలో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి పార్టీలో చేరేందుకు నేతలు ఆసక్తి చూపుతున్నారని ఈ సందర్భంగా కంది శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రామాలను అభ్యున్నతి బాటలో నడిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామా పంచాయతీల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు గిమ్మ సంతోష్ రావు, మునిగెల విఠల్, చరణ్‌గౌడ్, లోక ప్రవీణ్‌రెడ్డి, పోరెడ్డి కిషన్, శ్రీలేఖ, ఆవుల వెంకన్న పాల్గొన్నారు.

ప్రతీరోజు అభ్యర్థులకు ఫోన్లు

▸ పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న కొద్ది అభ్యర్థుల్లో గుబులు

ఇచ్చోడ, డిసెంబరు, 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో ఓటును అడ్డుగా పెట్టుకొని కొందరు అభ్యర్థులకు నిత్యం ఫోన్లు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం అభ్యర్థులు ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు కొందరు యువకులు గ్రూప్‌గా ఏర్పడి అభ్యర్థులతో మాట్లాడు తున్నారు. అన్నా అడ్డమీదకు వచ్చాం. కొంచెం మీ వారిని పంపించండి. మా వద్ద కొంతమంది ఓటర్లు ఉన్నారు. ఈ రాత్రికి మాకు దావత్తుకు డబ్బులు ఇవ్వండి అంటూ నిత్యం అభ్యర్థులకు ఫోన్లు చేస్తున్నారు. అభ్యర్థులు ఇచ్చిన ఎంతో కొంత మొత్తంతో యువకులు ఆయా గ్రూపుల్లోని అభ్యర్థులకు దావతులు ఇచ్చి ఓట్లు పడేలా చేయాలంటున్నారు. ఇంకొందరు అభ్యర్థులు గెలుపు దెవుడెరుగూ దావత్తు పేర్లతో ఇదేమీ సమస్య అంటూ తలలు పట్టుకుంటున్నారు. చివరి వరకు ఓటు ఎవరికి వేస్తారో తెలియదు. వారి వద్దకువెళ్తే ఇష్టానుసారంగా డబ్బులు ఖర్చు చేస్తున్నారు. అంటూ మరికొందు సర్పంచ్ అభ్యర్థులు మదన పడుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ జడ్పీటీసీ



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న మాజీ జడ్పీటీసీ నల్ల వనిత రాజేశ్వర్

మావల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): :మండలంలో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ జడ్పీటీసీ నల్ల వనిత రాజేశ్వర్ సహా పలువురు ముఖ్య నాయకులు కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ మేరకు వారికీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, టీపీసీసీ మాజీ జనరల్ సెక్రటరీ సుజాత పలువురు పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు మద్యం దుకాణాల బంద్

▸ రేపటి నుంచి 11 వరకు మొదటి విడత ▸ 12 నుంచి 14 వరకు రెండో విడత ▸ 15 నుంచి 17 వరకు మూడో విడత మద్యం బంద్

భైంసా, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల సందర్భంగా మద్యం దకాణాలు మూడు రోజుల పాటు మూత పడనున్నాయి. పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో జర గనున్న నేపథ్యంలో అదే క్రమంలో విడతల వారిగా ఆయా ప్రాంతాల్లో వైన్స్‌లను మూడు రోజుల పాటు మూసి ఉంచాలని ఎలక్షన్ కమీషన్ ఆదేశాలు జారీచేసింది. అందుకు అనుగుణంగా ఎక్సైజ్ శాఖ అధికారులు వైన్స్ షాపుల మూసివేతకు సంబంధించిన ఉత్తర్వులను జారీచేశారు. అందుకు అనుగుణంగా జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు పంచాయతీఎన్నికలు జరిగేవిడతల వారిగా ఆ యా మండలాల పరిధిలో మద్యం దుకాణాలు మూసి వేసేందుకు గాను చర్యలు చేపట్టారు.

● 11న తొలి విడత ఎన్నికలు

జిల్లాలో తొలి విడత ఎన్నికలు ఈ నెల 11న జరగనున్నాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, ఎక్సైజ్ శాఖ ఉత్తర్వుల ప్రకారం తొలి విడత ఎన్నికల సందర్భంగా వైన్స్ షాపులు మంగళవారం నుంచి గురువారం వరకు మూతపడనున్నాయి. జిల్లాలో తొలి విడత



మద్యం దుకాణం

కింద నిర్మల్ డివిజన్ పరిధిలోని ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్, మా మడ, లక్ష్మణ్‌చాంద మండలాల పరిధిలోని 136 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి. అయితే మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి గురువారం సాయంత్రం ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ప్రక్రియ ముగిసే వరకు వైన్సులు బంద్ ఉండనున్నాయి.

● 14న రెండో విడత ఎన్నికలు

జిల్లాలో రెండో విడత ఎన్నికలు ఈ నెల 14న జరగనున్నాయి. ఇందుకు గాను మద్యం దుకాణాలు 12 (శుక్రవారం) సాయంత్రం 5 గంటల నుంచి 14న (ఆదివారం) జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగింపు, ఫలితాల వెల్లడి వరకు మూతపడనున్నాయి. జిల్లాలో రెండో విడత కింద నిర్మల్ డివిజన్ పరిధిలోని నర్సాపూర్(జి), దిలావర్‌పూర్, సారంగాపూర్, సోన్, నిర్మల్ మండలాలతో పాటు భైంసా డివిజన్ పరిధిలోని లోకేశ్వరం, కుంటాల మండలాల పరిధిలో గల మొత్తం 131 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి.

● 17న చివరి విడత ఎన్నికలు

జిల్లాలో చివరి విడత ఎన్నికలు ఈ నెల 17న జరగనున్న దృష్ట్యా ఇక్కడి ప్రాంతాల్లో 15 (సోమవారం) సాయంత్రం 5 గంటల నుంచి మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. ఎన్నికల ప్రక్రియ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి అనంతరం 17న (బుధవారం) సాయంత్రం మద్యందుకాణాలు తెరుచుకోనున్నాయి.చివరివిడతలో భైంసా మండల పరిధిలోని బాసర, ముథోల్, తానూర్, కుభీర్, భైంసా మండలాల పరిధిలోని 133 గ్రామ పంచాయతీలలో ఈ ఎన్నికలు జరగనున్నాయి.

జోరందుకున్న స్థానిక ఎన్నికల ప్రచారం

ముథోల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో జోరందుకున్న ప్రచారం. పంచాయతీ ఎన్నికల ప్రచారంలో సర్పంచ్ అభ్యరులు బిజీ అయి పూర్తిగా ప్రజా క్షేత్రంలోనే గడుపుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రజలను కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ముథోల్ నియోజకవర్గంలోని ఆయా అభ్యర్థులు నిత్యం ప్రజల మధ్యనే గడుపుతూ వారి మద్దతు కోసం ప్రయత్ని స్తున్నారు. ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ తమను గెలిపిస్తే ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారో ఓటర్లకు వివరిస్తున్నారు.గ్రామాల్లో జట్ల వారీగా నాయకులు, కార్యకర్తలు ఒక్కోప్రాంతాన్ని ఎంచుకుంటూ ఓటర్ల మద్దతు కూడ గట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఒకరికి మించి మరొకరు వినూత్న రీతిలో ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటే కష్ట పడుతూనే ఉన్నారు. ప్రచారం చేస్తే టీ, టిఫిన్‌లు చేస్తూ తమ అనుచర గణంతో ఓట్ల కోసం పాట్లు పడుతున్నారు. కులసంఘాలు, యూత్ సంఘాల సభ్యులను కలుస్తూ తమకే పట్టం

▸ ఇంటింటా ప్రచారం

కట్టాలంటూ ప్రాధేయపడుతున్నారు. తమ వైపుకు మలుపు కొనేందుకు రహస్య మంతనాలు జరుపుతూ నజరానాలు సైతం ఇచ్చేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తుంది.గెలుపే లక్ష్యంగా ఎత్తుకుపై ఎత్తులువేస్తే పక్కాప్రణాళికలు వేస్తున్నారు.ఇదిలా ఉండగా వార్డు ల అభ్యర్థులలో సైతం తీవ్రపోటీ నెలకొంది. ఎలాగైనావార్డు సభ్యుడిగా గెలు పొందాలని తమ వార్డులలోని ఓటర్లను కలుస్తూ తనను వార్డు మెంబర్‌గా గెలిపించాలని కోరు తున్నారు.

చలి..పులి

▸ రోజు రోజుకు తీవ్రమవుతున్న చలి
▸ అర్లి(టి)లో 8.0 గా నమోదు



ఇచ్చోడలో చలికి మంట కాస్తున్న యువకులు

ఆదిలాబాద్‌అర్బన్/ఇచ్చోడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రత మరింత విపరీతంగా పెరుగుతుంది. పగలు రాత్రి అనే తేడా లేకుండా చలిప్రభావం కనిపిస్తుంది. ఆదివారం జిల్లా గరిష్ఠ సగటు ఉష్ణోగ్రతలు 27.8 కాగా కనిష్ఠంగా 8.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్పంగా భీంపూర్ మండలం అర్లి(టి)లో 8.0, బజార్‌హత్నూర్‌లో 8.5, బోథ్ పొచ్చెరలో 8.7, సాత్నాలలో 9.0, ఆదిలాబాద్‌రూరల్ పిప్పల్‌ధరిలో 9.1, బేల చప్రాలలో9.1, సోనాలలో 9.3, తలమడుగులో 9.4,ఆదిలాబాద్‌అర్బన్‌లో 9.5, ఇచ్చోడలో 10.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం, రాత్రి వేళల్లో చలిమంటలు వేసుకుంటు వెచ్చదనం పొందుతున్నారు. ప్రజలు చలి తీవ్రతతో వెచ్చని దుస్తులు ధరించి బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.చిన్న పిల్లలు, వృద్దులు శ్వాసకోస సంబంధిత వ్యాధుల భారీన పడి అస్వస్థతకు గురవుతున్నారు. మరికొన్నాళ్ల పాటు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు

చలి తీవ్రత.. మంటతో వెచ్చన

ఇచ్చోడలో కొన్ని రోజులుగా రాత్రి వేళ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. తెల్లవారు జామున 10డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పట్టణ శివారు, గ్రామీణ ప్రాంతాల ఇళ్ల వాళ్లు ఎక్కువ చలితో బాధ పడతున్నారు. ఇచ్చోడ పట్టణ శివారులో ఓ కాలనీలో చలి మంట కాగుతుండగా ఆ చిత్రాన్ని ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.

కాంగ్రెస్,బీఆర్ఎస్ మాటలు నమ్మొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నగేష్

తలమడుగు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల తోనే గ్రామపంచాయతీల అభివృద్ధి సాధ్యమని పదవుల కోసం కాంగ్రెస్ బీఆర్ఎస్ నాయకులు చెప్పి మాయమాటలకు నమ్మి ఎవరు మోసపోవద్దని అదిలాబాద్ ఎంపీ నగేష్ అన్నారు.ఆదివారం అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని సుంకిడిలో బీజేపీ పార్టీ కార్యకర్తలతో కలిసి అదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ పత్రిక సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు,ఈసందర్భంగా ఎంపీ నగేష్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఐదు సంవత్సరాల పదవీకాలం పూర్తయిన స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకుండా రాష్ట్రప్రభుత్వం రెండు సంవత్సరాల తర్వాత ఎన్నికలు నిర్వహించడంతో గ్రామాలు పూర్తిగా అస్తవ్యస్తంగా తయారయ్యాయి అన్నారు, గత ప్రభుత్వంలో కూడా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం నిధులే అభివృద్ధికి దోహదం చేశాయని అన్నారు, 15 ఫైనాన్షియల్ నగదు కోసమే రాష్ట్ర ప్రభుత్వం హడావుడిగా స్థానిక సంస్థల నిర్వహిస్తుందని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆలోచించి బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థులను తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు, పదవుల కోసం బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయమాటలుకు నమ్మి మోసపోవద్దని కోరారు కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికలు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామం దేశం అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు కనపర్తి చంద్రకాంత్, జక్కుల ప్రభాకర్, మాజీ రైల్వే బోర్డు మెంబర్ జీవి రమణ,మాజీ మండల అధ్యక్షుడు స్వామి, సుంకిడి మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, బోన్ల వెంకటస్వామి, విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆడె గజేందర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆడె గంజేందర్

నేరడిగొండ., డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలం రోజురోజుకూ పెరుగుతోంది. గుత్పాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్, గ్రామ పటేళ్ళు, మరియు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆడె గజేందర్ పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆడె గజేందర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి అధికార పార్టీతోనే సాధ్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందిస్తున్న ప్రజా పాలన, అభివృద్ధి పట్ల నిబద్ధత చూసే ప్రజలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ వైపు వస్తున్నారన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల వల్ల గ్రామాలకు ఒరిగేదేమీ లేదని. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. పార్టీలో చేరిన వారిలో ఓడేపల్లి నరేందర్ (మాజీ సర్పంచ్) భీంరావు పటేల్, లింగంపల్లి సురేష్ కొండా, రాజేందర్, గస్కాంటి కిష్టయ్యా, ఉద్గుల పెద్ద గంగయ్య, లస్మన్న, లింగయ్య గోడం జుగేందర్, గోడం లక్ష్మణ్ ఉయికే నాగో రావు, గోడం మంతు పేందుర్ గణపతి తదితరులు ఉన్నారు.

సీవోసీ సభ్యత్వం పేరిట డబ్బులు ఇవ్వొద్దు

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ అసోసియేషన్ సభ్యత్వం పేరిట డబ్బులు ఇచ్చే అవసరం లేదని, ఇప్పటికే అమాయకుల నుంచి డబ్బులు తీసుకున్న వ్యక్తిపై ఎస్పీకి ఫిర్యాదు చేశామని అసోసియేషన్ అధ్యక్షుడు దినేష్ మాటోలియ తెలిపారు. ఎవరైనా బాధితులు డబ్బులు ఇచ్చినట్లయితే తమకు సమాచారం అందించాలన్నారు.జిల్లా కేంద్రంలోని పాత బస్సు స్టాండ్ వద్ద ఉన్న కార్యాలయానికి వచ్చి వివరాలు ఇవ్వాలన్నారు.

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ

ధర్పల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం సామూహిక మహాపడిపూజ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని అయ్యప్ప సన్నిధానంలో జరిగిన ఈ మహాపడిపూజ కార్యక్రమానికి ధర్పల్లి, ఇందల్వాయి, డిచ్‌పల్లి, సిరికొండ, నిజామాబాద్ మండలాలకు చెందిన అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం నుంచి అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.









ఆదిలాబాద్ జిల్లాలో ఉదయం, సాయంత్రం వేళల్లో పొగమంచు కమ్మేస్తోంది. పట్టణ శివారులోని చాందా వాగు వద్ద పొగమంచు అందాలు కనువిందు చేశాయి. పొగమంచులో ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉండాల్సి ఉంది.
- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్


● ఇచ్చోడలోని అయ్యప్ప స్వామి ఆలయం


ఉత్సవాలకు ముస్తాబైన శివాలయం

నేటి నుంచి శివాలయంలో శ్రీరామ కోటి ఉత్సవాలు

నేరడిగొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక శివాలయంలో ఆదివారం నుంచి శ్రీరామ కోటి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ సభ్యుడు ఏలేటి సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు మాట్లాడుతూ.. శివానంద భారతి స్వాముల వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమము జరుగునని, ఈ పవిత్ర కార్యక్రమంలో మండలంలోని భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.


నామ సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధల మధ్య.. అఖండ నామ సంకీర్తన

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్వామి సుందర చైతన్యనంద 78వ జన్మదినోత్సవమును పురస్కరించుకుని 78 గంటల అఖండ నామ సంకీర్తన కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య సాగింది. ఈనెల 4వ తేదీన ప్రారంభమైన నామ సంకీర్తన ఆదివారం మధ్యాహ్నం వరకు చేపట్టారు. భక్తులు భగవంతుడి నామ కీర్తన చేస్తూ భక్తి బావాన్ని చాటుకున్నారు. అనంతరం శ్రీకృష్ణుడిని దీపారాధనతో కొలిచారు. ప్రత్యేక పూజలు, భజన సంకీర్తనలతో మురళీకృష్ణ ఆలయం శ్రీకృష్ణ నామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ.. గురువులు శ్రీసుందర చైతన్యనంద స్వామిజీ జన్మదినోత్సవం సందర్భంగా నామ సంకీర్తన చేపట్టినట్లు తెలిపారు. ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తూ ప్రతీఒక్కరు సన్మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో సుందర సత్సంగ్ అధ్యక్షుడు డాక్టర్ నర్సింగ్ రెడ్డి, సభ్యులు జవ్వాజి అశోక్, కొమ్మే వార్ బాశెట్టి, బ్రహ్మం, శివుడయ్య, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

చలి పులి..

- జిల్లాలో కొనసాగుతున్న చలి తీవ్రత
- అర్లి(టి)లో అత్యల్పంగా 8.0 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- అప్రమత్తంగా ఉండాలి : వైద్య నిపుణులు

మరిన్ని వివరాలు 7వ పేజీలో....

- ఇచ్చోడలో మహిమాన్వితమైన శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయం
- నిత్యం స్వామికి దూపదీప నైవేద్యాలు
- ప్రత్యేక పూజాది కార్యక్రమాలు, అర్చనలు, అభిషేకాలు
- ప్రతీ బుధవారం మహా అన్నదానం
- ప్రతియేటా వందల సంఖ్యలో స్వాముల మాలధారణ, అయ్యప్ప దీక్షలు
- తెలంగాణ జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి పడిపూజలకు స్వాముల హాజరు
- నేడు ఆలయ 11వ వార్షికోత్సవం

హరిహర సుతనే.. అయ్యప్ప


● ప్రధాన ఆలయంలో ప్రత్యేక అలంకరణలో విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్య, అయ్యప్పస్వామి వారి విగ్రహాలు

మహిమాన్విత ఆలయంగా.. ఇచ్చోడలోని అయ్యప్ప ఆలయం కీర్తి పొందుతోంది. ప్రతి యేటా అయ్యప్ప మాలధారులు వందల సంఖ్యలో మాలధారణ స్వీకరిస్తున్నారు. నిత్యం ప్రత్యేక పూజలు, అభిషేకలు, అర్చనలు, భిక్షా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. సామూహిక భిక్షలతో అయ్యప్ప ఆలయంలో నిత్యం పండగ వాతావరణం నెలకొంటుంది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, మంచిర్యాల, మహారాష్ట్ర నుంచి మాలధారులు ఇక్కడ పడిపూజలకు హాజరై అయ్యప్ప శరణుఘోషాలతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగుతోంది. దినదిన అభివృద్ధి చెందుతూ.. అయ్యప్ప దీక్షలు, భక్తుల భజనలు, ప్రత్యేక పూజలు, ప్రతీ బుధవారం అన్నదానం, సర్వాంగ సుందరమైన మందిరం, విశాలమైన ప్రాంగణం వెలసి ఆ ప్రాంతమంతా అధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అయ్యప్పస్వాములు, భక్తులు అక్కడికి చేరుకుంటేనే చాలు మదిలో ఓ భక్తిభావం.. దైవచింతనలో పడి పరవశించి పోవడం గమనార్హం. (- మిగతా 6లో)



● ఆశ్రమ పాఠశాల



ఆశ్రమ పాఠశాలలో కూరగాయలు, అరటిపండ్లు పరిశీలిస్తున్న పీవో

ITDA Pulse

పల్స్ యాప్‌తో.. అక్రమాలకు తెర



ఫోన్‌లో ఏర్పాటు చేసిన పల్స్ యాప్


జిల్లాలోని విద్యా సంస్థలలో విద్యార్థులకు వండి పెట్టిన వివరాలు

ఇక విద్యార్థులకు పౌష్టికాహారం...

- జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పోషక విలువలతో కూడిన భోజనం
- సరికొత్త పద్ధతుల్లో విద్యారులకు మెరుగైన ఆహారం
- ఐటీడీఏ పీవో ఆలోచనతో పల్స్ యాప్‌కు శ్రీకారం
- బాధ్యతలు చేపట్టిన నెల రోజుల్లోనే భారీ మార్పులు
- ఆదిలాబాద్ జిల్లాలోని పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా అమలు
- ఉమ్మడి జిల్లాలో మొత్తం 133 ఆశ్రమ పాఠశాలలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని.. గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, గురుకుల కళాశాలలు, ఏకలవ్య ఆదర్శ పాఠశాలల్లో చదువుకుంటున్న గిరిజన విద్యార్థులకు మెనూ ప్రకారం సరైన పోషక విలువల భోజనం అందించేలా, ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా ఉండాలన్న ఉద్దేశంతో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ ఆలోచన మేరకు పల్స్ యాప్‌కు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా విద్యార్థులకు సరైన భోజనం అందించకుండా ఇష్టారీతిలో అక్రమాలకు పాల్పడి వారి నోళ్లు కొట్టకుండా ఉండడానికి సరికొత్త యాప్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. దీని పట్ల గిరిజన ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉట్నూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం ప్రతీరోజు విద్యార్థులకు వండి పెడుతున్న అల్పాహారం మొదలుకొని, మధ్యాహ్న భోజనం, స్నాక్స్ రాత్రి భోజనం సైతం మెనూలో రూపొందించిన విధంగా విద్యార్థులకు అందించాలని ఈ యాప్‌లో పొందుపర్చారు. అంతేకాకుండా విద్యార్థులకు అందిస్తున్న భోజనం అన్నం, కూరగాయలు, పప్పు, సాంబార్, చట్నీలు, బట్టర్‌మిల్క్, పెరుగు, ఉడికించిన శనగలు, పల్లిపట్టి, గుడ్లు, తదితర వాటిని ఫొటోలు చిత్రీకరించి ఎప్పటికప్పుడు పల్స్ యాప్‌లో పెట్టాల్సి ఉంటుంది. వండిపెట్టిన ఆహార పదార్థాల ఫొటోలను యాప్‌లో అప్ లోడ్ చేయడం ద్వారా విద్యార్థులకు సక్రమంగా ఆహారం అందించాలని అధికారులు భావిస్తున్నారు.

నెల కిందటే బాధ్యతల స్వీకరణ

ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పని చేసిన ఖుష్బుగుప్తా దీర్ఘకాలం సెలవుల్లో వెళ్లారు. దీంతో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ గత నెల రోజుల క్రితం ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అయితే బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పీవో ఆశ్రమ పాఠశాలలు తనిఖీ చేస్తూ అక్కడ విద్యార్థులకు వండుతున్న భోజనాలు (- మిగతా 6లో)


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆరట్టులో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా కడ్తాల్ గ్రామంలో గల అయప్పస్వామి ఆలయంలో శ్రీధర్మశాస్త్ర ఆరట్టు మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ గురుస్వామి, కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించి ఆశీర్వదించారు. ఇందులో పలువురు నాయకులు, కార్యకర్తలు, అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రధాన కూడళ్లలో పేదలకు దుప్పట్ల పంపిణీ

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మనవ సేవే మాధవ సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లను పంపిణీ చేసి సామాజిక దృక్పథాన్ని చాటుకున్నారు. పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో, రైల్వే స్టేషన్‌లో తలదాచుకున్న నిరుపేదలకు చద్దర్‌లు అందజేశారు. ప్రతియేటా మాదిరిగానే ఈయేడు సైతం పంపిణీ చేసినట్లు సమితి సభ్యులు తెలిపారు. గత పదేళ్ల నుంచి సమితి ద్వారా విస్తృత సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో చిందం దేవిదాస్, శ్రీపాద వార్ శ్రీనివాస్, చౌహాన్ శశికళ, శ్రావణ్ నాయక్, సాయిరాం, అర్ఫాత్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ విధులకు ఆటంకం ..పలువురిపై కేసు

మరిన్ని వివరాలు 7వ పేజీలో....


మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రామారావు


పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

రైతులు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలి

- జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ రామారావు రాథోడ్
- కజర్ల గ్రామంలో పశువులకు గర్భకోశ వ్యాధులపై వైద్య శిబిరం

తలమడుగు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై దృష్టి సాధించాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ రామారావు సూచించారు. ఆదివారం మండలంలోని కజ్జర్ల గ్రామంలో పశువులకు గర్భకోశ వ్యాధులపై ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే వ్యవసాయంతో పాటు ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. పాడి పరిశ్రమపై ఆధారపడ్డ రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. చలికాలంలో పశువులకు అంటూ వ్యాధులు చూడకుండా జిల్లావ్యాప్తంగా గాలికుంటు టీకాల నివారణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామన్నారు. అలాగే మేకలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులను వేశామన్నారు. పశువుల్లో గర్భకోశ వ్యాధుల వల్ల కొన్ని పశువులు మృత్యువాత పడుతున్నాయని, వాటిని అరికట్టేందుకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పశు వైద్యశాలలో పశువులకు సబ్సిడీపై గడ్డి విత్తనాలను అందిస్తున్నామని, పశువులకు ఎలాంటి వ్యాధులు సోకినా పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఇందులో మండల పశువైద్యాధికారి డాక్టర్ లావణ్య, సీనియర్ పశువైద్యాధికారి డాక్టర్ దూద్రం రాథోడ్, వైద్య సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సోయా కొనుగోళ్ల నిలిపివేత

- సొసైటీ సీఈవో కేశవ్

తాంసి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తాంసి మండల కేంద్రంలోని సహకార సొసైటీ ఆవరణలో కొనుగోలు చేస్తున్న సోయా పంట దిగుబడులను సోమవారం నుంచి నిలిపివేయనున్నట్లు సహకార సొసైటీ సీఈవో కేశవ్ ఆదివారం ఒక ప్రకటన పేర్కొన్నారు. దీనిలో భాగంగా తదుపరి అధికారికంగా ఆదేశాలు వచ్చేవరకు సోయా రైతులు మార్కెట్ యార్డుకు సోయా దిగుబడులను తీసుకురావద్దని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని తాంసి భీంపూర్, తలమడుగు మండల రైతులు గమనించాలని ఆయన కోరారు. తదుపరి అధికారికంగా ఆదేశాలు వచ్చేవరకు నిలిపివేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఎప్పుడు కొనుగోలు చేయాలో తాము ప్రకటన చేస్తామని, అప్పటి నుంచి మళ్లీ తీసుకురావాలని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి సోయా రైతులు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.


● పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కప్పర్లలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

గ్రామాల్లో ప్రత్యేక నిఘా : ఎస్పీ

తాంసి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సోషల్ మీడియా, నగదుతో పాటు మద్యంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఆదివారం మండలంలోని కప్పర్ల గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ ఎన్నికల నిబంధనలపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. మద్యం, నగదు పంపిణీ చేయకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం నగదు, మద్యం ఇచ్చిన, తీసుకున్న నేరం కింద పరిగణించ బడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. యువత చెడు మార్గాన్ని వీడి ప్రజలకు తమ వంతు సహాయాన్ని అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ ఫణిదర్, ఎస్సైలు జీవన్ రెడ్డి, రాధిక, పోలీస్ సిబ్బంది ఉన్నారు

ఐచర్ వాహనంలో మంటలు

- నిర్మల్ జిల్లా నుంచి యాపల్‌గూడకు గడ్డి లోడ్‌తో వెళ్తుండగా ఘటన

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కదులుతున్న ఐచర్ వాహనంలో మంటలు చెలరేగిన ఘటన ఆదిలాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. మంటలు గమనించిన స్థానికులు వెంటనే స్పందించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా... వారు హుటాహుటిన అక్కడికి చేరుకొని మంటలు ఆర్పారు. వివరాల్లోకి వెళ్తే.. నిర్మల్ జిల్లా నుంచి ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్ గూడకు గడ్డి లోడ్‌తో వెళ్తున్న వాహనం స్థానిక మసూద్ చౌక్ వద్దకు చేరుకోగానే అక్కడ విద్యుత్ తీగలు తగిలాయి. వాహనం మొత్తం గడ్డి ఉండడంతో క్షణాల వ్యవధిలో మంటలు అంటుకోవడంతో డ్రైవర్ ఆసిఫ్ వాహనం విడిచి బయటకు వచ్చేశాడు. గమనించిన స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో డ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.


వాహనంలో ఉన్న గడ్డికి అంటుకున్న మంటలు

ముగిసిన బోర్లకుంట జాతర

భీంపూర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పల్‌కోటి, నిపాని, గొల్లగాడ్, తాంసి(కే)శివారులోని బోర్లకుంట జాతర చివరి రోజు ఆదివారం వివిధ గ్రామాల ప్రజలతో కిక్కిరిసిపోయింది. ఆదిలాబాద్ జిల్లా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ధవాల్ మాలిక్ బాబాకు కిచిడీ మలిదలు సమర్పించారు. ఆ తర్వాత భక్తిశ్రద్ధలతో చాదర్ సమర్పించారు. అక్కడే వంటలు చేసుకొని ఇంటిల్లిపాది భోజనాలు చేశారు. గ్రామాలలో పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు. జాతరలో పిల్లలు సందడి చేశారు. భక్తుల కోసం స్థానికులు ముజావర్‌లు షేక్ అఫ్రోజ్, షేక్ మునీర్, షేక్ ఆరిఫ్, డే గే నారాయణలు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. స్థానికులు భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. స్థానిక పంచాయతీల నుంచి సర్పంచులు వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న వారు ధవళ మాలిక్ బాబా వద్ద విశేష పూజలు చేశారు. భీంపూర్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


దవాల్ మాలిక్ బాబాకు పూజలు చేస్తున్న దృశ్యం